సింగరేణి బదిలీ వర్కర్లకు తీపి కబురు

2364 మందిని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రకటించిన సీఎండీ

సింగరేణి సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, ఆగస్టు 30 : సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న బదిలీ వర్కర్లకు సీఎండీ బలరామ్ తీపి కబురు అందించారు. 2364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 మష్టర్లు, ఉపరితల గనుల్లో 240 మష్టర్లు విధులు నిర్వహించిన బదిలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా డైరెక్టర్(పర్సనల్)కు ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ ఒటి నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించబోతున్నట్లు స్పష్టం చేయగా, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్వార్టర్ల కేటాయింపులోనూ ప్రాధాన్యత ఉంటుందని, సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పనిచేయాలని తెలిపారు. ఈ ఏడాది కంపెనీ ఆధ్వర్యంలో వెయ్యికి పైగా ఇంటర్నల్ ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని పేర్కొన్నారు. కంపెనీ వ్యాప్తంగా కార్పొరేట్ ఏరియాలో 25 మంది, కొత్తగూడెంలో 17 మంది, ఇల్లందులో 9 మంది, మణుగూరులో 21 మంది, భూపాలపల్లిలో 476 మంది, రామగుండం-1లో 563 మంది, రామగుండం -2లో 50 మంది, రామగుండం -3, ఆడ్రియాలలో 240 మంది, బెల్లంపల్లిలో 9 మంది, మందమర్రిలో 299 మంది, శ్రీరాంపూర్ ఏరియాలో 655 మంది బదిలీ వర్కరలకు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు జిల్లాకు ఉప ముఖ్యమంత్రి భట్టి

సోలార్ ప్లాంట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామగుండం సీపీ

- ఎస్టీపీపీ సందర్శన.. పలు అభివృద్ధి పనులు పరిశీలన
- చెన్నూర్‌లో 11 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం
- ఏర్పాట్లు పరిశీలించిన రామగుండం సీపీ శ్రీనివాస్

జైపూర్/చెన్నూర్ రూరల్, ఆగస్టు 30 : మంచిర్యాల జిల్లాలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం పర్యటించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకొని ఫ్లోటింగ్ సోలార్ పవర్‌ప్లాంట్‌ను సందర్శిస్తారు. అనంతరం అడ్మిన్ బిల్డింగ్, కంట్రోల్ రూం, సీవోటూ మొథనాల్ ప్లాంట్‌లను పరిశీలిస్తారు. ఆపై 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం నిర్మించే స్థలాన్ని పరిశీలించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. చెన్నూర్ మండలం శివలింగాపూర్ సమీపంలో మూతపడ్డ చెన్నూర్-1 ఇంక్లైన్ గని ఆవరణలో సుమారు రూ. 45 కోట్లతో నిర్మించిన 11 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. ఈ మేరకు సీపీ శ్రీనివాస్ అధికారులతో కలిసి శుక్రవారం ఆయాచోట్ల ఏర్పాట్లను పరిశీలించారు. పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన్, భాస్కర్‌తో కలిసి పోలీ సుబందోబస్తు, ట్రాఫిక్‌పై చర్చించారు. పెద్దపల్లి అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఎసీపీలు ప్రతాప్, సురేంద్ర, చెన్నూర్ సీఐ రవీందర్, ఎస్ఐలు శ్వేత, సుబ్బారావు పాల్గొన్నారు..

బట్టి సభను అడ్డుకుంటాం

లక్షెట్టిపేట,ఆగస్టు 30 : ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సభను అడ్డుకుంటామని అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి తీరని అన్యాయం చేస్తున్నదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ అందజేస్తాలమని చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అంశంపై నోరు మెదపడం లేదని తెలిపారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని..

అఖిలపక్షం, తుడుందెబ్బ ఆధ్వర్యంలో రాస్తారోకో..

రాస్తారోకో చేస్తున్న నాయకులను లేపుతున్న పోలీసులు

తిర్యాణి, ఆగస్టు 30 : ఎలాంటి షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని అఖిలపక్షం నాయకులు, మాజీ జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సారా రమేశ్ గౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు పులి వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తిర్యాణి మండలకేంద్రంలోని కుమ్రంభీం చౌరస్తాలో అఖిలపక్షం, తుడుందెబ్బ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షలలోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఇన్‌చార్జి ఎస్ఐ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాస్తారోకోను విరమింపజేయాలని కోరారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంతరావు, డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాష్, మండల అధ్యక్షుడు తొడసం భాస్కర్ ఆయా సంఘాలు, పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి గోస తీరేదెలా..!

కుకుడ వాగులో చెలిమల నుంచి నీరు తీసుకుంటున్న నాగుల్వాయి గ్రామస్తులు (ఫైల్)

కొత్తనాగుల్వాయి ప్రాథమిక పాఠశాల వద్ద లీకవుతున్న నీరు

నాగుల్వాయి గ్రామంలో నల్లాలు బిగించకుండా వదిలేసిన మిషన్ భగీరథ పైపులు

- నాగుల్వాయి, కొత్త నాగుల్వాయి గ్రామస్తుల అవస్థలు
- మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా ఫలితం శూన్యం
- వారానికోసారి సరఫరా.. గంటసేపైనా బిందె కూడా నిండని వైనం
- తప్పనిసరి పరిస్థితుల్లో చెలిమల నీరు తెచ్చుకుంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కౌటాల/చింతలమానెపల్లి/బెజ్జూర్, ఆగస్టు 30 : బెజ్జూర్ మండలం నాగుల్వాయి, కొత్త నాగుల్వాయి గ్రామస్తులు తాగు నీటి కోసం తండ్లాడుతున్నారు. కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ ద్వారా శుద్ధజలమందించగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గుక్కెడు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. నాగుల్వాయిలో 100కు పైగా కుటుంబాలుంటాయి. కొన్ని ఇండ్ల వరకు పైపులైన్ వేసినప్పటికీ నల్లాలు బిగించలేదు. దీంతో నేరుగా ఆ పైపులైన్‌ల వద్ద బురదలో నీళ్లు పట్టుకోలేని పరిస్థితి ఉన్నది. ఇక వారానికోసారి నీరు సరఫరా చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది. సన్నటి ధార వస్తుండడంతో గంటసేపు పట్టుకున్నా కనీసం బిందె కూడా నిండడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాగుకు వెళ్లి చెలమెల నీరు తెచ్చుకోవాల్సి వస్తున్నది.

కొత్త నాగుల్వాయిలోనూ..

ఇక కొత్త నాగుల్వాయి(కొత్తగా ఏర్పడిన గ్రామం)లో 22 కుటుంబాలుండగా, ఇందులో నాలుగు కుటుంబాల వారు సొంతంగా పైపు వేసుకొని నీరు పట్టుకుంటున్నారు. ఇక మిగతా 18 కుటుంబాలు తాగు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నాయి. గతంలో మంచి నీటి కోసం పైప్‌లైన్ వేయగా, దానిపై నుంచి సీసీ రోడ్డు వేశారు. సీసీ రోడ్డు కింద పైప్‌లైన్ ఉండిపోవడంతో నీళ్లు పట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పల్లెకు 50 మీటర్ల దూరంలోనే ఓవర్ హెడ్ ట్యాంకు ఉండగా, ఇప్పటి వరకు చుక్క నీరందించిన దాఖలాలు లేవు. ప్రాథమిక పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ వాల్వ్ మొత్తం బురద నీటిలో మునిగిపోయింది. పాఠశాల కోసం పైపులైన్ వేసినప్పటికీ దానికి నల్లా పెట్టకపోవడంతో నీరంతా వృథాగా పోతున్నది. మురుగు నీరంతా అందులో కలుస్తున్నది. దీంతో దిక్కుతోచని తప్పనిసరి పరిస్థితుల్లో నాగుల్వాయి, కొత్త నాగుల్వాయి గ్రామస్తులు సైకిళ్లు, కాలినడకన మూడు కిలోమీటర్ల దూరంలోని వాగుకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలకు వచ్చే కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నామని, ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలి అనేక మంది మంచం పట్టారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం నీటి సమస్యలేదని, గ్రామస్తులు వాగు నీటికి అలవాటు పడ్డారని చెప్పడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా వాస్తవ పరిస్థితులు తెలుసుకొని ఇంటింటికీ మిషన్ భగీరథ నీరందించేలా చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

కొత్త నాగుల్వాయి గ్రామంలో మిషన్ భగీరథ పైపు మీద వేసిన సీసీ రోడ్డు

నీటి సమస్య లేకుండా చూస్తా..

నాగుల్వాయి గ్రామంలో నీటి సమస్య లేకుండా చూస్తాం. ఇప్పటికే పైప్‌లైన్‌లను పరిశీలించాం. ఈ మధ్య వాటర్ సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయి. కొత్త నాగుల్వాయి మినహా అన్ని వాడలకు మిషన్ భగీరథ పైపులైన్ ఉంది. కానీ నల్లాలు పెట్టలేదు. త్వరలో వాటిని బిగిస్తాం. మరికొద్ది రోజుల్లో తాగు నీటి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- అభిలాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

బురద నీళ్లు ఎట్లా తాగుడు

మా ఊరిలో మిషన్ భగీరథ నీళ్లు సక్కగా రావు. పైపులైన్లు పగిలిపోయినయి. ఎప్పుడోసారి వస్తాయి. సన్నటి ధార వస్తుంది. గంటసేపైనా బిందె నిండదు.ఒకవేళ పట్టుకుందామనుకున్నా బురద నీళ్లే.. గవ్వి ఎట్లా తాగుడు. గందుకే కుకుడ వాగుకు పోయి తాగు నీళ్లు తెచ్చుకుంటున్నం. ఇకనైనా సార్లు మా గోస పట్టించుకోవాలె. పైపులైన్లు మంచిగ చేసి ఇంటింటికీ నీళ్లియ్యాలే.

- టాకిరే పోచుబాయి, నాగుల్వాయి

పక్కకే ట్యాంకున్నా..

మా వాడ పక్కకే వాటర్ ట్యాంకు ఉంది. అయినా ఏ ఒక్క రోజు నీళ్లు వచ్చింది లేదు. మా వాడకు నీళ్లియ్యాలనే ఆలోచనే సార్లకు లేదు. ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకుంటలేరు. నల్లా నీళ్లు వచ్చినంక వాగుకు మేమెందుకు పోతం. గా నీళ్లు తాగితో రోగాలు వస్తున్నయి. కానీ ఏం చేసుడు గా నీళ్లే దిక్కాయే మాకు.

- టాకిరే కార్తీక్, కొత్త నాగుల్వాయి గ్రామం..

మా వాడకు పైపులైన్ లేదు..

మా ఊరిలో 22 కుటుంబాలు ఉన్నాయి. నలుగురు బడి కాడ నుంచి పైపు పెట్టుకుని నీళ్లు పట్టుకుంటున్నరు. కానీ మిగతా 18 కుటుంబాలకు పైపులైన్ లేదు. ఇగ నీళ్లు ఎట్లా ఇస్తారు. కొందరికి బావులు ఉన్నాయి. మరికొందరు వాగుల నీళ్లు తెచ్చుకుంటున్నరు. ఇంతకు ముందు పైపులైన్ వేశారు. కానీ దాని మీదనే సిమెంట్ రోడ్డు వేసిండ్లు. అది ఇప్పుడు ఎట్లా పనిచేస్తది. వాగే మమ్మల్ని ఆదుకుంటుంది.

- జెంగటి మల్లయ్య, కొత్త నాగుల్వాయి

'మార్కెట్' చైర్మన్ల నియామకమెప్పుడో!

- చెన్నూర్, బెల్లంపల్లిలో పాలకవర్గాలపై జాప్యం
- నెలల తరబడి ఎదురు చూస్తున్న ఆశావహులు
- కాంగ్రెస్ పార్టీ తీరుపై అసహనం

చెన్నూర్ మార్కెట్ కమిటీ కార్యాలయం

చెన్నూర్/బెల్లంపల్లి, ఆగస్టు 30 : చెన్నూర్, బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాల నియమాకంలో జాప్యం చేస్తుండగా, కాంగ్రెస్ శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతున్నది. మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియమాకం ఇప్పటికే జరగగా, చెన్నూర్, బెల్లంపల్లిలో మాత్రం చేపట్టలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు తొమ్మిది నెలలు కావస్తున్నా నియామకం చేపట్టకపోవడంపై పార్టీ శ్రేణులు పెదవి విరుస్తున్నారు. ఎమ్మెల్యే తర్వాత ప్రధానమైన పదవి కావడంతో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్‌ల పదవుల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలువురు ఆశావహులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం అనేకమార్లు ఎమ్మెల్యేలు వివేక్, వినోద్‌ను కలసినట్లు తెలిసింది. ఇక తమకంటే తమకే మార్కెట్ కమిటీ పదవి వస్తుందని పలువురు నాయకులు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. మార్కెట్ కమిటీ పాలక వర్గం నియమాకంలో జాప్యమెందుకు జరుగుతుందో తెలియక నాయకులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా నిర్ణయం తీసుకొని ఎవరికో ఒకరికి ఇవ్వచ్చుకదా? అంటూ పలువురు మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డవారికి పదవి కట్టబెట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

బెల్లంపల్లిలో ఎస్సీ మహిళకు రిజర్వ్

బెల్లంపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. ఆశావహులు పెద్ద సంఖ్యలో పోటీ పడుతున్నారు. పదవీ దక్కించుకోవడానికి ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని నెలలుగా పాలకవర్గం లేకపోవడంతో మార్కెట్ కమిటీ అభివృద్ధి కుంటుపడుతున్నది. రైతులు కూడా నష్టపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ నామినేటెడ్ పదవులపై దృష్టి పెట్టకుండా తన మంత్రి పదవి కోసం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. మంత్రి పదవి విస్తరణే తర్వాతే మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియామకం చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.

బాబా చూపిన మార్గంలో నడవాలి

పట్నాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- పట్నాపూర్‌లో పూలాజీ బాబా జయంతి
- మెగా వైద్య శిబిరం.. 50 మందికి పైగా రక్తదానం
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- పాల్గొన్న ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

జైనూర్, ఆగస్టు 30 : ప్రతి ఒక్కరూ పూలాజీ బాబా చూపిన భక్తి మార్గంలో నడవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జైనూర్ మండలం పట్నాపూర్‌లోని సిద్ధేశ్వర్ సంస్థానంలో పులాజీబాబా జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. 100వ జన్మదినం సందర్భంగా 100 హారతులతో బాబా చిత్రపటానికి హారతి నిచ్చారు. ఈ సందర్భంగా సంస్థాన కమిటీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికిపైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పక్క రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అన్నదానం చేశారు. కలెక్టర్ మరాఠీ భాషలో బాబా చూపిన సత్యమార్గాని వివరించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి.. చదువుల్లో రాణించాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ వచ్చే ఏడాది వరకు విశ్రాంత గదులతో పాటు 50 మరుగుదొడ్లు, రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ దీపక్ తివారీ,ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, మాహారాష్ట్ర హింగోలి ఎమ్మెల్యే మాధవ్‌రావ్ పాటిల్, డీఎస్పీ సదయ్య, సీనియర్ నాయకుడు అరిగేల నాగేశ్వర్‌రావ్, జైనూర్ సీఐ ఎలుపుల రమేశ్, ఎస్ఐ సాగర్, సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్, ఇంగ్లే మాధవ్, తహసీల్దార్ తిరుపతి నాయబ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్,ఆర్ఐ వాగ్మారే సుధాకర్, సంస్థాన్ కమిటీ సభ్యులు డుక్రే సుభాష్, మాగాడే దాదారావ్, ఖందారే బాలాజీ, కుమ్ర గోవిందరావ్, మానిక్‌రావ్, రంగారావ్ పటేల్‌పాల్గొన్నారు.

కోలుకుంటున్న కోవ లక్ష్మి

ఎమ్మెల్యేను పరామర్శించిన పలువురు నేతలు

ఎమ్మెల్యే కోవ లక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 30 : తీవ్రమైన జ్వరంతో హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోద హాస్పిటల్‌లో చేరిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోలుకుంటున్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ వేర్వేరుగా కలిసి ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

- నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు
- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్
- సిర్పూర్(టీ), లోనవెల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల తనిఖీ
- హెచ్ఎంలపై ఆగ్రహం

లోనవెల్లి జడ్పీ పాఠశాలలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీఈవో అశోక్

సిర్పూర్(టీ), ఆగస్టు 30 : విధుల్లో నిర్లక్ష్యం తగదని, నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి పార్శి అశోక్ ఉపాధ్యాయులను హెచ్చరించారు. శుక్రవారం సిర్పూర్(టీ), లోనవెల్లి కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోనవెల్లి గ్రామంలోని జడ్పీ పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో ప్రధానోపాధ్యాయుడు, కాంప్లెక్స్ హెచ్ఎం దోని సత్యనారాయణ లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీవీల్లో బోధన చేయాలని ఉన్నప్పటికీ ఎందుకు నిరుపయోగంగా పడేశారంటూ మండిపడ్డారు. రేపటిలోగా ఐఎఫ్‌పీ ప్యానెల్ టీవీలను అందుబాటులోకి తీసుకురావాలని, బోధన ఫొటోలు తీసి తనకు పెట్టాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. లోనవెల్లి కాంప్లెక్స్ పరిధిలోని బాలుర ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, కారెంటు సౌకర్యం లేకపోవడం, రికార్డులు మెయింటనెన్స్ చేయకపోవడంపై ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల గ్రాంట్‌ను ఉపయోగించి కరంట్‌ను పునరుద్ధరించాలని సూచించారు. అంతకుముందు మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, పీజీహెచ్ఎంలు ప్రమీలా, సదాశివుడు, సీఆర్పీ దహెగాం పవన్, దుర్గం రాజేశ్ ఉన్నారు.

ఇద్దరు రైతులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

మంచిర్యాలటౌన్, ఆగస్టు 30 : బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలో మంచిర్యాల జిల్లాలోని ఇద్దరు రైతులకు ఉత్తమ రైతులుగా రాష్ట్రస్థాయి అవార్డులు అందించనున్నట్లు కేవీవీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. కోట శివకృష్ణ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యా లయం 10వ ఆవిర్భావదినోత్సవ వేడుకల సందర్భంగా సెప్టెంబర్ మూడో తేదీన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఈ అవార్డులను అం దించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయంలో విశేష కృషిచేస్తున్న హాజీపూర్ మండలానికి చెందిన శ్యాం సుందర్‌రావు, మందమర్రి మండలం మామిడిగ ట్టు గ్రామానికి చెందిన శ్యాం సుందర్ రెడ్డికి రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు పురస్కారం అందించనున్నట్లు ఆయన తెలిపారు.